పునర్విభజనపై ఉమ్మడి పోరు

7 రాష్ట్రాల సీఎంలకు స్టాలిన్ లేఖ.. మార్చి 22న చెన్నైలో సమావేశం

చెన్నై, మార్చి 7: జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా కేంద్రంపై పోరుకు కలిసిరావాలని ఏడు రాష్ట్రాల సీఎంలకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ లేఖ రాశారు. డీలిమిటేషన్ ప్రక్రియకు వ్యతిరేకంగా రాజకీయ పార్టీల ఉమ్మడి కార్యాచరణ కమిటీలో భాగస్వాములు కావాలని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, బీజేపీ పాలిత ఒడిశా సీఎం మోహన్ చంద్ర మాఝి, కేరళ సీఎం పినరయి విజయన్, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోపాటు ఆ రాష్ట్రాలలో అధికారంలో లేని పార్టీల సీనియర్ నాయకులు, బీజేపీ నాయకులకు కూడా స్టాలిన్ పిలుపునిచ్చారు. ఉమ్మడి కార్యాచరణను రూపొందించేందుకు మార్చి 22న చెన్నైలో సమావేశం నిర్వహిస్తున్నట్టు సామాజిక

మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన ప్రకటించారు.

సమాఖ్య వ్యవస్థపై దాడి

నియోజకవర్గాల పునర్విభజన సమాఖ్యవ్యవస్థపై దాడిగా స్టాలిన్ అభివర్ణించారు. పార్లమెంట్‌లో తమ వాణిని వినిపించే హక్కును తొలగించడం ద్వారా జనాభా నియంత్రణ కోసం పాటుపడిన రాష్ట్రాలను కేంద్రం శిక్షిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ ప్రజాస్వామిక అన్యాయాన్ని తాము అనుమతించబోమని స్టాలిన్ స్పష్టం చేశారు. వచ్చే ఏడాది తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్రం హిందీ విధింపు, పునర్విభజనలను డీఎంకే తీవ్రంగా నిరసిస్తున్నది. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలను నియోజకవర్గాల పునర్విభజన చర్య నాశనం చేయగలదని స్టాలిన్ హెచ్చరించారు. వాజ్‌పేయి ప్రభుత్వం 2002లో తీసుకువచ్చిన సవరణ ద్వారా 1976 తర్వాత జరిగిన డీలిమిటేషన్ ప్రక్రియలను నిలిపివేసిందన్నారు. దీని ద్వారా 2026 వరకు లోక్‌సభ సీట్లలో ఏ విధమైన మార్పులు రావడానికి వీల్లేదని ఆయన తెలిపారు. అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టాలని కేంద్రం ఆలోచిస్తోందని, దీని వల్ల జనాభాను నియంత్రించిన రాష్ట్రాలు లోక్‌సభలో స్థానాలను కోల్పోనుండగా జనాభాను నియంత్రించని రాష్ట్రాలు లాభపడనున్నాయని స్టాలిన్ పేర్కొన్నారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోనుండగా ఉత్తరాది రాష్ట్రాలు లాభపడనున్నాయని ఆయన వివరించారు.

హిందీ వలసపాలనను సహించం

బ్రిటిష్ వలసపాలన స్థానంలో హిందీ వలసపాలనను తమిళనాడు సహించబోదని స్టాలిన్ హెచ్చరించారు. హిందీ అమలును అనుమతించాలంటూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బెదిరిస్తూ రెచ్చగొడుతున్నారని ఆయన ఆరోపించారు. తాను ఎన్నడూ గెలవలేని యుద్ధానికి కేంద్ర మంత్రి ప్రధాన్ కాలుదువ్వుతున్నారని స్టాలిన్ తీవ్రంగా వ్యాఖ్యానించారు. తమిళనాడును ఎవరూ బ్లాక్‌మెయిల్ చేసి లొంగదీసుకోలేరని ఆయన స్పష్టం చేశారు.

అమెరికా టారిఫ్‌లపై రాజీ మార్గమే

- ఇతర దేశాల కంటే భిన్నంగా వ్యవహరిస్తున్న భారత్
- ప్రతీకార సుంకాల ప్రభావాన్ని తగ్గించేందుకు కసరత్తు
- కీలక దిగుమతులపై సుంకాల తగ్గింపునకు యోచన

న్యూఢిల్లీ, మార్చి 7: భారత్‌పై ప్రతీకార సుంకాలు విధించేందుకు అమెరికా సిద్ధమవుతుండటంతో ఆ ప్రభావాన్ని నివారించేందుకు అనుసరించాల్సిన మార్గాలపై విధాన నిర్ణేతలు, వ్యాపారులు కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా అమెరికా నుంచి భారత్‌కు జరిగే కీలక దిగుమతులపై సుంకాలను తగ్గించాలని ప్రభుత్వ యోచిస్తున్నట్టు, వివిధ రంగాల కంపెనీలు తమ వ్యాపారం సజావుగా కొనసాగేలా చూసుకునేందుకు అమెరికన్ భాగస్వాములతో చర్చలు జరుపుతున్నట్టు స్పష్టమవుతోంది. ప్రస్తుతం అమెరికాలోనే ఉన్న కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం భారత్, అమెరికా మధ్య జరుగుతున్న చర్చలకు సారథ్యం వహిస్తున్నారు. ప్రస్తుత ఘర్షణాత్మక వాతావరణంలో భారత్ ప్రతీకార చర్యలకు దిగకుండా రాజీ ధోరణిని అవలంబిస్తోందని, అమెరికాతో చురుకైన వాణిజ్య చర్చలు, దౌత్య సంప్రదింపులు జరుపుతూ ఇతర దేశాలకు భిన్నంగా వ్యవహరిస్తోందని ప్రముఖ బ్రోకరేజీ సంస్థ 'ఎస్ సెక్యూరిటీస్' తెలిపింది. సుంకాలపై ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉద్రిక్తతల నడుమ రాజీ విధానాన్ని అనుసరించడం

భారత్‌ను ప్రత్యేక స్థానంలో నిలిపిందని, వాణిజ్య చర్చలను కొనసాగించడం, సుంకాలను హేతుబద్ధీకరించడం ట్రంప్ సర్కారును శాంతింపజేయవచ్చని అభిప్రాయపడింది.

ఘర్షణ వీడి కలసి నడుద్దాం

భారత్-చైనా సంబంధాలు మరింత బలపడాలని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఇ శుక్రవారం ఆకాంక్షించారు. తూర్పు లద్దాఖ్‌లో సైనిక ప్రతిష్టంభన ముగిసిన తర్వాత ఉభయ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలలో సానుకూల పురోగతి కనపడుతోందని అన్నారు. పరస్పరం తూలనాడుకోవడం లేదా ఘర్షణపడడం మాని ఒకరికొకరం మద్దతు ఇచ్చుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. డ్రాగన్, ఏనుగు మధ్య సహకారం ఉభయ దేశాలకు ప్రయోజనకరమని అన్నారు.



కెనడా ప్రధాని కంటతడి

ట్రంప్ విధానాలను తప్పబట్టిన ట్రూడో

టొరంటో: కొద్ది రోజుల్లో పదవి నుంచి దిగిపోతున్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తన ఆఖరి మీడియా సమావేశంలో తీవ్ర ఉద్వేగానికి గురై కన్నీరు పెట్టుకున్నారు. తన తొమ్మిదేళ్ల పాలనలోని గందరగోళ క్షణాలను, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాల గురించి వివరిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. అధికార లిబరల్ పార్టీ కొత్త ప్రధానిని ఎన్నుకున్న తర్వాత ఆదివారం ట్రూడో పదవి నుంచి తప్పుకుంటారు. కాగా, కెనడా నుంచి దిగుమతయ్యే వస్తువులకు గురువారం నుంచి అమరికా 25 శాతం టారిఫ్‌లు విధించింది. దీని ప్రభావంతో మార్కెట్లు కుప్పకూలడంతో దాని అమలును ట్రంప్ వచ్చే నెలకు వాయిదా వేశారు.

సుంకాలు, ఆంక్షలు విధిస్తా

- రష్యాకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక
- ఉక్రెయిన్‌తో శాంతి ఒప్పందానికి ఒత్తిడి

వాషింగ్టన్: రష్యా-ఉక్రెయిన్ మధ్య పోరును ఎట్టి పరిస్థితుల్లో ఆపాలని ట్రంప్ గట్టిగా నిర్ణయించారు. ఉక్రెయిన్‌తో శాంతి ఒప్పందం చేసుకునేంత వరకు రష్యాపై పెద్దయెత్తున ఆంక్షలు, సుంకాలు విధిస్తామంటూ శుక్రవారం ఆ దేశ అధ్యక్షుడు పుతిన్‌ను హెచ్చరించారు. ఇంకా ఆలస్యం కాక ముందే ఇద్దరూ చర్చల వేదికపైకి రావాలంటూ ఇరు దేశాల అధ్యక్షులకు స్పష్టమైన సందేశాన్ని పంపారు. కాగా, 2022లో ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణకు దిగిన వెంటనే అప్పటి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ రష్యాపై పలు ఆంక్షలను విధించారు. అయితే ఇటీవల జెలెన్‌స్కీతో చర్చల సందర్భంగా ట్రంప్ వైఖరిని చూసిన ప్రపంచ దేశాలు రష్యాతో మైత్రికి ఆయన తహతహలాడుతున్నారని ఊహించాయి. ఈ క్రమంలో ఆయన ఆ దేశంపై గతంలో విధించిన ఆంక్షలను సడలిస్తారని, అనుకూల వైఖరిని అవలంబిస్తారని కథనాలు వచ్చాయి. అయితే ట్రంప్ తాజా ప్రకటన వారికి షాకిచ్చింది.

అణు ఒప్పందంపై చర్చిద్దాం..ఇరాన్‌కు ట్రంప్ లేఖ

అణు ఒప్పందంపై ఇరాన్‌తో చర్చలు జరపాలని ఆశిస్తున్నట్టు ట్రంప్ తెలిపారు. అణు ఒప్పందంపై చర్చించేందుకు అంగీకరించాలని కోరుతూ ఇరాన్ నాయకత్వానికి గురువారం ట్రంప్ ఓ లేఖ రాశారు. చర్చలకు ఇరాన్ అంగీకరిస్తుందని భావిస్తున్నానని, అది ఇరాన్‌కే మేలని తాజా ఇంటర్వ్యూలో ట్రంప్ వ్యాఖ్యానించారు.

తుర్లపాటి రాజేశ్వరికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

న్యూఢిల్లీ, మార్చి 7: భారతీయ సాహిత్య పురస్కారాలలో అత్యుత్తమమైనదిగా భావించే సాహిత్య అకాడమీ అవార్డులను అనువాద రచనలు చేసిన 21 మందికి శుక్రవారం ప్రకటించారు అత్యుత్తమమైన అనువాద రచనలు చేసినందుకు 2024 సంవత్సరానికి తెలుగులో తుర్లపాటి రాజేశ్వరి, హిందీలో మదన్ సోని, ఇంగ్లిష్‌లో అనిసుర్ రెహమాన్‌లతో పాటు మొత్తం 21 మందికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులను ప్రకటించారు. ఈ అవార్డు కింద 50 వేల నగదుతో పాటు తామ్ర పత్రాన్ని అందజేస్తారు.

3 నెలల్లో డూప్లికేట్ ఓటర్ ఐడీలకు చెక్

- ఇది దశాబ్దాల సమస్య అని ఈసీ వెల్లడి
- ఎట్టకేలకు ఈసీ నేరాంగీకారం: టీఎంసీ

న్యూఢిల్లీ: డూప్లికేట్ ఓటర్ గుర్తింపు కార్డు నంబర్ల సమస్య దశాబ్దాల నుంచి ఉందని, ఈ సమస్యను రానున్న మూడు నెలల్లో పరిష్కరిస్తామని కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) శుక్రవారం ప్రకటించింది. ఈ సమస్యను కప్పిపుచ్చుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఈసీ ఓ ప్రకటనను విడుదల చేసింది. ఈపీఐసీ నంబరుతో సంబంధం లేకుండా, ఓ పోలింగ్ స్టేషన్‌తో అనుసంధానమైన ఎలక్టర్ (ఓటరు) తన ఓటును అదే పోలింగ్ స్టేషన్‌లో మాత్రమే వేయవచ్చునని, వేరొక చోట ఓటు వేయరాదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ చివరికి తన నేరాన్ని అంగీకరించిందని టీఎంసీ శుక్రవారం పేర్కొంది. అనేక మందికి డూప్లికేట్ ఎలక్టొరల్ ఫొటో ఐడెంటిటీ కార్డ్ (ఈపీఐసీ) నంబర్లను కేటాయించినట్లు ఒప్పుకుందని ఆ పార్టీ ఎంపీ సాకేత్ గోఖలే ఎక్స్‌లో ట్వీట్ చేశారు.ఈసీ మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నపుడు, ఎలక్టొరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు 'సరైనవికానటువంటి సిరీస్'ను ఏ విధంగా ఉపయోగించారని ఆయన ప్రశ్నించారు మరోవైపు డూప్లికేట్ ఓటర్ ఐడీల అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తేందుకు విపక్ష ఎంపీలు కసరత్తు ప్రారంభించారు. స్వల్పకాలిక చర్చ, జీరో అవర్, కాలింగ్ అటెన్షన్ వంటి నిబంధనల ప్రకారం టీఎంసీ, ఇతర ప్రతిపక్ష పార్టీల ఎంపీలు నోటీసులు ఇచ్చినట్టు విశ్వసనీయ సమాచారం.

సైన్యంతో అసద్ విధేయుల ఘర్షణ

సిరియా తీరంలో 70 మంది మృతి

లటాకియా: సిరియా సైన్యానికి, ఆ దేశ మాజీ అధ్యక్షుడు అసద్ సాయుధ విధేయులకు మధ్య జరిగిన ఘర్షణలో 70 మంది దాకా మృతి చెందారని యుద్ధ పర్యవేక్షకుడు ఒకరు శుక్రవారం వెల్లడించారు. ప్రభుత్వ నియంత్రణ లేని తీరంలో ఈ ఘటన జరిగిందని చెప్పారు. ఈ ఘటన కారణంగా లటాకియా, టార్టస్, వాటి చుట్టుపక్కల ఉన్న పట్టణాలు, పల్లెలకు అదనపు బలగాలు పంపినట్టు ప్రభుత్వం తెలిపింది. ఈ ప్రాంతాలను అసద్ విధేయులైన సాయుధులు తమ అధీనంలోకి తీసుకొనేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం.

వలసదారుల పడవలు మునక 186 మంది గల్లంతు

కైరో: వలసదారులతో ప్రయాణిస్తున్న నాలుగు పడవలు యెమెన్, జిబౌతి జలాల్లో మునిగిపోయాయి. ఈ ప్రమాదాల్లో ఇద్దరు మరణించగా, 186 మంది గల్లంతయ్యారు. ఇందులో రెండు పడవలు యెమెన్ జలాల్లో గురువారం తిరగబడ్డాయని వలసదారుల అంతర్జాతీయ సంస్థ ప్రతినిధి తమిమ్ తెలిపారు. ఇద్దరిని రక్షించామని, కానీ 181 మంది వలసదారులు, ఐదుగురు సిబ్బంది గల్లంతయ్యారన్నారు.

భవనంపై నుంచి దూకి విదేశాంగ శాఖ అధికారి ఆత్మహత్య!

న్యూఢిల్లీ: ఓ ఐఎఫ్ఎస్ అధికారి శుక్రవారం ఉదయం న్యూఢిల్లీలో తాను నివసిస్తున్న భవనం నాలుగో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం మృతుడు భారత విదేశాంగ శాఖ ప్రధాన కార్యాలయంలో సంచాలకుడిగా పని చేస్తున్నట్టు తెలిసింది. ఆయన డిప్రెషన్(కుంగుబాటు)తో బాధ పడుతున్నట్టు, తల్లితో కలిసి జీవిస్తున్నట్టు తెలిసింది. 'మృతుడిని జితేంద్ర రావత్‌గా గుర్తించాం. ఆయనకు 35-40 ఏండ్లు ఉండొచ్చని అనుకుంటున్నాం. ఘటనా స్థలిలో ఎలాంటి సూసైడ్ నోట్ లభ్యం కాలేదు' అని పోలీస్ అధికారి ఒకరు తెలిపారు.

కూలిన రెండు వాయుసేన విమానాలు

పైలట్, సిబ్బంది సురక్షితం

న్యూఢిల్లీ:వాయుసేనకు చెందిన రెండు విమానాలు శుక్రవారం వేర్వేరు చోట్ల కూలిపోయాయి. రవాణా విమానం ఏఎన్-32 శుక్రవారం పశ్చిమ బెంగాల్‌లోని బగ్‌డోగ్రా విమానాశ్రయం వద్ద ప్రమాదవశాత్తూ కూలిపోయింది. సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. శుక్రవారం ఉదయం ఐఏఎఫ్ జాగ్వార్ విమానం కూడా హర్యానాలోని అంబాలాలో కూలిపోయింది. శిక్షణ కోసం వెళ్లినపుడు ఈ సంఘటన జరిగింది. దీనిలోని పైలట్ కూడా సురక్షితంగా బయటపడ్డారు.

మళ్లీ పేలిన స్పేస్‌ఎక్స్ స్టార్ షిప్

టెక్సాస్: స్పేస్‌ఎక్స్ స్టార్‌షిప్ వ్యోమనౌక గురువారం అంతరిక్షంలో మళ్లీ పేలింది. టెక్సాస్ నుంచి ప్రయోగించిన కొన్ని నిమిషాలకే ఈ ప్రమాదం జరిగింది. దీంతో ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్ఏఏ) ఫ్లోరిడాలోని కొన్ని గగనతల ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను ఆపాల్సి వచ్చింది. తాజా ప్రయోగ వైఫల్యం ఈ ఏడాది మస్క్ తలపెట్టిన రాకెట్ ప్రయోగంలో రెండవది. స్టార్‌షిప్ శకలాలు దక్షిణ ఫ్లోరిడా, బహమాస్ దగ్గర పడిపోవడం పలు వీడియోల్లో కనిపించింది. దీంతో స్టార్‌షిప్ ప్రయోగాల్లో ఎనిమిదోదీ పేలుడు కారణంగా వైఫల్యం చెందింది. 'ఇప్పుడు మాకు కొంత ప్రాక్టీస్ లభించింది' అని స్పేస్‌ఎక్స్ ప్రతినిధి అన్నారు.

వెస్ట్ బ్యాంక్‌లో భారత బందీలకు విముక్తి

న్యూఢిల్లీ: వెస్ట్ బ్యాంక్‌లోని అల్ జాయెం అనే గ్రామంలో బందీలుగా ఉన్న 10 మంది భారత్‌కు చెందిన నిర్మాణ కార్మికులను ఇజ్రాయెలీ అధికారులు గురువారం రక్షించారు. ఈ కార్మికులంతా గడచిన నెల రోజులుగా బందీలుగా ఉన్నారని జనాభా, ఇమ్మిగ్రేషన్ సంస్థ పేర్కొంది. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్(ఐడీఎఫ్), న్యాయ శాఖ సంయుక్తంగా ఆపరేషన్ చేసి వీరిని రక్షించింది. నిర్మాణ కార్మికులు చట్టబద్ధంగానే ఇజ్రాయెకు వచ్చారని, అయితే ఉపాధి కల్పిస్తామని నమ్మబలికిన అల్ జమీమ్ గ్రామ స్థానికుడు ఒకరు వారి పాస్‌పోర్టులను జప్తు చేసుకున్నాడని వివరించింది.

వీసా కావాలంటే సోషల్ మీడియా వివరాలు వెల్లడించాల్సిందే

అమెరికా కొత్త నిబంధన

న్యూఢిల్లీ, మార్చి 7: అమెరికా వీసా, గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే భారతీయులు ఇమ్మిగ్రేషన్ దరఖాస్తులతోపాటు తమ సోషల్ మీడియా ఖాతాల సమాచారాన్ని కూడా ఇప్పుడు అందచేయాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని అమెరికా హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్(డీహెచ్ఎస్) మార్చి 5న ఓ నోటీసులో వెల్లడించింది. గ్రీన్ కార్డులు, పౌరసత్వం, ఇతర ప్రయోజనాలు కోరుతూ దరఖాస్తు చేసుకునే భారతీయులు సహా ఏటా 35 లక్షల మందికిపైగా విదేశీయుల నుంచి ఈ సమాచారాన్ని కోరనున్నట్టు డీహెచ్ఎస్ ప్రకటించింది. ఇమ్మిగ్రేషన్ స్క్రీనింగ్‌ను కట్టుదిట్టం చేయాలన్న ఉద్దేశంతో ఈ ఏడాది జనవరిలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేసిన 14161 ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో భాగంగా ఈ ప్రతిపాదన ఉంది. కొత్త నిబంధన మేరకు దరఖాస్తుదారులు తొమ్మిది ప్రధాన ఇమ్మిగ్రేషన్ ఫారాలలో తమ సోషల్ మీడియా ఖాతాల వివరాలను అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్‌కు అందచేయవలసి ఉంటుంది. పాస్‌వర్డ్ తెలియచేయవలసిన అవసరం లేదు. ఈ సమాచారాన్ని దరఖాస్తుల గుర్తింపును తనిఖీ చేసేందుకు, జాతీయ భద్రతా ముప్పులను అంచనా వేసేందుకు ఉపయోగిస్తారు. భారతీయ ఇమ్మిగ్రెంట్లు ముఖ్యంగా స్టెమ్ ప్రొఫెషనల్స్, హెచ్-1బీ ఆశావహులు, ఈబీ-5 పెట్టుబడిదారులకు ఈ కొత్త నిబంధనతో నిఘా మరింత అధికమవుతుంది. సాధారణ ఆన్‌లైన్ సంభాషణలు కూడా సమీక్షకు గురవుతాయని ఇమ్మిగ్రేషన్ నిపుణులు హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో వ్యక్తుల ప్రవర్తనపై నిఘా ఉంటుందని, పోస్టులు, కామెంట్లు, చాటింగ్‌లపై సమీక్ష ఉండే అవకాశం ఉందని వారు తెలిపారు.

దుబాయ్ నుంచి 17 బంగారు కడ్డీలు తెచ్చా

- అమెరికా, యూరప్ దేశాలకూ వెళ్లా
- స్మగ్లింగ్ కేసులో పట్టుబడ్డ నటి రన్యారావు

బెంగళూరు, మార్చి 7: దుబాయ్ నుంచి రూ.14 కోట్లకు పైగా విలువైన బంగారం స్మగ్లింగ్ చేస్తూ బెంగళూరు విమానాశ్రయంలో పట్టుబడ్డ నటి రన్యారావు విచారణలో కీలక విషయాలు వెల్లడించారు. తాను దుబాయ్ నుంచి 17 బంగారు కడ్డీలను తీసుకుని వచ్చినట్టు ఆమె రెవెన్యూ అధికారులకు తెలిపింది. తాను దుబాయే కాక మధ్య ప్రాచ్య, యూరప్, అమెరికా, సౌదీ అరేబియా దేశాలు పర్యటించినట్టు తెలిపింది. ఈ ప్రయాణాల కారణంగా ప్రస్తుతం అలసిపోయానని, తనకు కొంత విశ్రాంతి కావాలని ఆమె కోరింది. తన తండ్రి కేఎస్ హెగ్డేష్ రియల్ ఎస్టేట్ వ్యాపారి అని, తన భర్త జతిన్ హుక్కేరి ఆర్కిటెక్ట్ అని వివరించింది. తన విచారణ అంతా సక్రమంగానే సాగుతున్నదని, ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వచ్ఛందంగానే తాను ఈ ప్రకటన ఇస్తున్నానని తెలిపింది. స్మగ్లింగ్‌లో రన్యారావు పాత్రధారే తప్ప సూత్రధారి కాదని, ఇండో-ఆసియన్ న్యూస్ తన కథనంలో పేర్కొంది. దుబాయ్ నుంచి ఆమె బంగారాన్ని తెచ్చినందుకు కేజీకి 4-5 లక్షలు తీసుకుంటుందని తెలిపింది. కాగా, ఈ స్మగ్లింగ్ వెనుక ప్రముఖ రాజకీయ నేత హస్తం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది.

ఉసురు తీసుకున్న భార్యా బాధితుడు

కంపెనీ వెబ్‌సైట్‌లో సూసైడ్ నోట్

ముంబై : భార్య వేధింపులకు మరో భర్త తన జీవితాన్ని ముగించాడు. నిశాంత్ త్రిపాఠీ (41) సూసైడ్ నోట్‌ను తాను పని చేస్తున్న కంపెనీ వెబ్‌సైట్‌లో పోస్ట్ చేసి, హోటల్ గదిలో గత శుక్రవారం (ఫిబ్రవరి 28) ఆత్మహత్య చేసుకున్నారు. ఈ తీవ్ర నిర్ణయానికి కారణం తన భార్య అపూర్వ పారిఖ్, ఆమె మేనత్త ప్రార్థన మిశ్రా అని ఆ సూసైడ్ నోట్‌లో తెలిపారు. ''జరిగినదానికి ఈ చివరి క్షణంలో నేను నిన్ను ద్వేషించవచ్చు. కానీ నేను అలా చేయను. ఈ క్షణంలోనూ నేను ప్రేమను ఎంచుకున్నాను. అప్పుడూ నిన్ను ప్రేమించాను. ఇప్పుడూ నిన్ను ప్రేమిస్తున్నాను. నేను ఎదుర్కొన్న అన్ని కష్టాల గురించి మా అమ్మకు తెలుసు. నా చావుకు నువ్వు, ప్రార్థన మౌసీ కూడా బాధ్యులు. కాబట్టి నిన్ను వేడుకుంటున్నాను, ఆమె దగ్గరికి వెళ్లకు. ఆమెను ప్రశాంతంగా ఏడవనివ్వు' అని సూసైడ్ నోట్‌లో రాశారు. నిశాంత్ తన తల్లి, సోదరుడు, చెల్లెమ్మకు కూడా సందేశాన్ని రాశారు. చివర్లో తన భార్యపై ప్రేమను చాటుకుంటూ ఓ పద్యాన్ని కూడా రాశారు. సినీ రంగంలో యానిమేటర్‌గా పని చేస్తున్న నిశాంత్ పాల్ఘర్ జిల్లాలో నివసిస్తున్నారు. ఆయన ఫిబ్రవరి 28న ఆత్మహత్య చేసుకున్నారు. అంతకు మూడు రోజుల ముందు ఆయన విలే పార్లేలోని ఓ హోటల్‌లో దిగారు. 'డోంట్ డిస్టర్బ్' అనే బోర్డును తన గది వద్ద వేలాడదీసి, ప్రాణాలు తీసుకున్నారు. ఆయన చాలాసేపు స్పందించకపోవడంతో హోటల్ సిబ్బంది మాస్టర్ కీతో తలుపులు తెరిచి చూశారు. ఆయన ఓ హుక్‌కు వేలాడుతూ కనిపించారు.

భార్యను చదువు మానేయమనడం క్రూరత్వమే

విడాకులు మంజూరు చేసిన మధ్యప్రదేశ్ హైకోర్టు

ఇండోర్: చదువు మానేయాలని భార్యను భర్త బలవంతపెట్టడం క్రూరత్వమేనని మధ్య ప్రదేశ్ హైకోర్టు స్పష్టం చేసింది. అర్థాంతరంగా చదువు మానేయాలని భార్యను బలవంతపెట్టడం, లేదా, చదువుకోవడాన్ని కొనసాగించలేని పరిస్థితిని సృష్టించడం ఆమె వైవాహిక జీవితం ప్రారంభంలోనే ఆమె కలలను నాశనం చేయడమేనని తెలిపింది. విద్యావంతుడు కానటువంటి లేదా తనను తాను మెరుగుపరచుకోవాలనే ఆసక్తి లేనటువంటి వ్యక్తితో కలిసి జీవించాలని ఆమెను నిర్బంధించడం కచ్చితంగా మానసిక క్రూరత్వం అవుతుందని చెప్పింది. విడాకులు మంజూరు చేయడానికి ఇది సరైన కారణమని స్పష్టం చేసింది. హిందూ వివాహ చట్టం ప్రకారం దంపతులిద్దరికీ విడాకులు మంజూరు చేసింది.

ముఖమంతా జుట్టుతో గిన్నిస్ రికార్డ్

భారత కుర్రాడికి అరుదైన వ్యాధి గుణం

న్యూఢిల్లీ, మార్చి 7: భారత్‌కు చెందిన లలిత్ పాటిదార్(18) ముఖమంతా జుట్టు కలిగిన పురుషుడిగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. అతడి ముఖంపై ప్రతి సెంటీ మీటర్‌కు 201.72 వెంట్రుకలున్నాయని గిన్నిస్ రికార్డ్స్ సంస్థ తేల్చింది. 'వార్‌వోల్ఫ్ సిండ్రోమ్'గా పిలిచే ఈ అరుదైన వ్యాధి లక్షణాన్ని కలిగి ఉండటమే లలిత్‌కు గిన్నిస్ రికార్డ్ తెచ్చి పెట్టింది. మధ్య యుగాల కాలం నుంచి ఇప్పటివరకు ఈ తరహా కేసులు కేవలం 50 మాత్రమే ప్రపంచ వ్యాప్తంగా నమోదయ్యాయని గిన్నిస్ రికార్డ్స్ తెలిపింది.

60 స్టేషన్లలో శాశ్వత వెయిటింగ్ ఏరియాలు

తొక్కిసలాటలు నివారణకే..

న్యూఢిల్లీ: ఢిల్లీ రైల్వే స్టేషన్ లాంటి తొక్కిసలాట ఘటనలు భవిష్యత్తులో జరగకూడదని రైల్వే శాఖ నిర్ణయించింది. దానిలో భాగంగా 60 ప్రధాన స్టేషన్లలో శాశ్వత బయట వేచి ఉండే ప్రాంతాలను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్టు తెలిపింది. ఇటీవలి ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో 18 మంది మృతి చెందిన క్రమంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రైలు భవన్‌లో సీనియర్ రైల్వే అధికారులతో శుక్రవారం సమావేశమైన మంత్రి అశ్వినీ వైష్ణవ్ దేశ వ్యాప్తంగా ప్రధాన స్టేషన్లలో రద్దీ నియంత్రణ చర్యలను అమలు పరిచే విషయంపై చర్చించారు.